RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా


తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 85 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం | 26.09.2026 | పేజీలు : 8

హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..

- నేడు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్



- హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు
- ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- మన్మోహన్ సింగ్ దేశానికి, తెలంగాణకు చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి పొన్నం
- ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి

నిత్యం నిఘా, హైదరాబాద్ : మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు. » 2

దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి : ప్రధాని మోదీ


- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య



» 2

యూపీ తయారీ బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్‌కు కంటి మీద కునుకు లేదు : అమిత్ షా

- అమేథీ ఏకే-203 రైఫిళ్లు నక్సలైట్లను వణికిస్తున్నాయన్న అమిత్ షా
- నేరాల అడ్డా నుంచి రక్షణ ఉత్పత్తుల కేంద్రంగా మారిన యూపీ
- భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.లక్ష కోట్లు దాటింది
- దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్న భారత్



» 2

సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి
- మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే నిజమైన నివాళి అని పేర్కొన్న రేవంత్
- కేంద్ర ప్రభుత్వంపై ఓట్లు, పార్టీలు, నిధుల దొంగతనం అంటూ తీవ్ర విమర్శలు



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణలో రైతులు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. » 2

ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు

- అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ
- గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ
- సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్
- అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్



వివరాలు 2 లో

హైదరాబాద్‌లో నకిలీ వైద్యుడి అరెస్ట్..

లైంగిక సమస్యలకు కూడా వైద్యం!

- గోల్కొండలో నకిలీ వైద్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఇంటర్ అర్హతతోనే రోగులకు వైద్యం అందిస్తున్న వైనం
- తల్లి, సోదరుడితో కలిసి క్లినిక్ నిర్వహిస్తున్న యువకుడు
- లేబుల్స్ లేని మందులు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం
- సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ అమాయకులను ఆకర్షిస్తున్నట్లు గుర్తింపు



» 2



గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ » 2



బడా గణేశ్ శోభాయాత్ర

- పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

- ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్
- మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం
- 'ప్యారడైజ్' సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన » 2

దేశంలో తగ్గుతున్న గ్యాస్ వాడకందార్ల సంఖ్య..!

- దేశంలో తొలిసారిగా తగ్గిన ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు
- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య 62 లక్షల కనెక్షన్ల తగ్గుదల
- అమెరికా-ఇరాన్ యుద్ధంతో దిగుమతులపై తీవ్ర ప్రభావం
- కొత్త కనెక్షన్లు నిలిపివేత, ఆధార్‌తో నకిలీల ఏరివేత



నిత్యం నిఘా, డెస్క్ : దేశంలో గడిచిన దశాబ్ద కాలంలో తొలిసారిగా గృహ వినియోగ ఎల్పీజీ వినియోగదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మొదటి వారం మధ్య సుమారు 62 లక్షల యాక్టివ్ గ్యాస్ కనెక్షన్లు తగ్గినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 333.9 మిలియన్లుగా ఉన్న వినియోగదారుల సంఖ్య, సెప్టెంబర్ నాటికి 327.7 మిలియన్లకు పడిపోయింది. పేద కుటుంబాల కోసం ఉద్దేశించిన ఉజ్వల పథకం లబ్ధిదారులు కూడా 6 లక్షల మేర తగ్గడం గమనార్హం. ఈ తగ్గుదలకు ప్రధాన కారణం అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణమేనని తెలుస్తోంది.... 2



రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ..

- ముగిసిన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం
- దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి
- ఈసారి వేలంలో 9 మంది పోటీపోటీగా పెరిగిన బిడ్లు
- లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం » 2

దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి : ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. స్వదేశీ భావజాలంతో దేశాభివృద్ధికి ప్రత్యేక దృక్పథాన్ని అందించిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తే బీజేపీకి, తమ ప్రభుత్వాల నిర్ణయాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. వ్యక్తి ప్రగతి సమాజం నుంచి వేరుగా కాకుండా, సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంత సారమని చెప్పారు. ప్రకృతిని దెబ్బ తీయకుండా సమాజం పురోగమించేలా అభివృద్ధి నమూనా ఉండాలని ఆయన ఆలోచనలు చెబుతాయని వివరించారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరడమే అంత్యోదయ లక్ష్యమని మోదీ గుర్తుచేశారు. ఏకాత్మ మానవతావాదాన్ని వివరిస్తూ, వ్యక్తి ఎదుగుదలతో పాటు సమాజం, ప్రకృతి, దేశం మధ్య సమతుల్యత ఉండాలని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని ప్రధాని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక వృద్ధే అభివృద్ధి కాదని, అందులో సామాజిక సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ కూడా భాగస్వామ్యం కావాలని ఆయన భావించినట్లు తెలిపారు. పేదల సంక్షేమం, సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మోదీ వివరించారు. ఈ ఆలోచనల స్ఫూర్తితోనే సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యంగా 'వికసిత్ భారత్' నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్'

ఉత్తమ ప్రజాసేవ అవార్డు

మొదటిపేజీ తరువాయి.. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి
- ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహా గణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

రూ.39 లక్షలకు బాలాపూర్ లడ్డూ..

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ వినాయక ఉత్సవాల్లో ఎంతో ప్రత్యేకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీ ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో కొత్త రికార్డు నమోదైంది. ప్రతి ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంపై భక్తుల్లో భారీ ఆసక్తి ఉంటుంది. ఈసారి కూడా లడ్డూను దక్కించుకునేందుకు 9 మంది భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఒకరిని మించి మరొకరు బిడ్ పెంచడంతో వేలం ఉత్కంఠగా సాగింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూను దక్కించుకున్న ప్రణీత్ రెడ్డిని ఉత్సవ నిర్వాహకులు, తోటి భక్తులు అభినందించారు. బాలాపూర్ గణేశుడి లడ్డూను దక్కించుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. దీంతో ప్రతి ఏడాది ఈ లడ్డూకు వేలంలో భారీ పోటీ నెలకొంటోంది.

హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం..
- నేడు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి.. ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తు చేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పని చేయడం తన రాజకీయ జీవితంలో గర్వ కారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

దేశంలో తగ్గుతున్న గ్యాస్ వాడకందార్ల సంఖ్య..!

మొదటిపేజీ తరువాయి..
ఈ తగ్గుదలకు ప్రధాన కారణం అమెరికా–ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణమేనని తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ఎల్పీజీ దిగుమతులకు ఆటంకం కలిగిం ది. భారత్ తన గ్యాస్ అవసరాల్లో దాదాపు 90 శాతం గల్ఫ్ నుంచే దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, సరఫరా వ్యవస్థలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చాలా మంది మార్కెటింగ్ కంపెనీలు కొత్త గృహ వినియోగ ఎల్పీజీ కనెక్షన్ల జారీని నిలిపివేశాయి. అంతే కాకుండా, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ వెరిఫికేషన్ ద్వారా అధికారులు తనిఖీలను కఠినతరం చేశా రు. దీని ద్వారా వాడకం లో లేని కనెక్షన్లు, ఒకే కుటుంబంలో ఉన్న బహుళ కనెక్షన్లు, ఇప్పటికే పైప్‌డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వాడుతున్న ఇళ్లను గుర్తించి ఎల్పీజీ కనెక్షన్లను తొలగిస్తున్నారు. పీఎన్‌జీ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఆ కనెక్షన్లకు మారేలా ప్రభుత్వం ప్రోత్సహించడం కూడా ఈ తగ్గుదలకు మరో కారణం. ప్రాంతాల వారీగా పరిశీలిస్తే, అత్యధికంగా దక్షిణ భారతదేశంలో 26.3 లక్షల కనెక్షన్లు తగ్గాయి. ఆ తర్వాత పశ్చిమ, ఉత్తర భారత దేశాల్లోనూ ఈ ప్రభావం అధికంగా కనిపించింది. దశాబ్దాలుగా క్రమంగా పెరుగుతూ వచ్చిన ఎల్పీజీ వినియోగదారుల సంఖ్య ఇలా ఒక్కసారిగా తగ్గడం ఇదే మొదటిసారి.

బడా గణేశ్ శోభాయాత్ర : పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరి కొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

యూపీ తయారీ బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్‌కు కంటి మీద కునుకు లేదు : అమిత్ షా

మొదటిపేజీ తరువాయి.. ఉత్తరప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులను మిగులుస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. దేశ రక్షణ ఉత్పత్తుల తయారీలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో శుక్రవారం జరిగిన 'ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన' (యూపీఐటీఎస్)ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా లక్నోలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణుల గురించి అమిత్ షా ప్రత్యేకంగా ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా, అమేథీలో తయారవుతున్న ఏకే–203 అసాల్ట్ రైఫిళ్లు నక్సలైట్లు, ఉగ్రవాదులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం, రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల సమన్వయంతో, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని అమిత్ షా ప్రశంసించారు. ఒకప్పుడు నేరాలు, వలసలకు నిలయంగా ఉన్న రాష్ట్రం, నేడు రక్షణ సామాగ్రి, వాహన శ్రేణి, వైద్య పరికరాల తయారీకి గమ్యస్థానంగా మారిందని కొనియాడారు. మెరుగైన శాంతిభద్రతల వల్లే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, 'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి' పథకం అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం నేడు సత్ఫలితాలను ఇస్తోందని షా తెలిపారు. ప్రస్తుతం భారత్ రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 1 లక్ష కోట్లు దాటిందని, దాదాపు 80 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందని, ఇందులో యూపీ పాత్ర కీలకమని అన్నారు. లక్నోలోని బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ ఫెసిలిటీని 2025 మే నెలలో ప్రారంభించగా, తొలి బ్యాచ్ క్షిపణులను 2025 అక్టోబర్ లో విడుదల చేశారని ఆయన పేర్కొన్నారు.

ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర.. మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి.. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

హైదరాబాద్‌లో నకిలీ వైద్యుడి అరెస్ట్.. లైంగిక సమస్యలకు కూడా వైద్యం!

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ నగరంలోని గోల్కొండలో వైద్య విద్యార్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ, నకిలీ డాక్టర్‌గా చలామణి అవుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంటర్మీడియట్ మాత్రమే చదివిన 23 ఏళ్ల అద్నాన్, తన కుటుంబ సభ్యులతో కలిసి అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తమ కథనంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండ ప్రాంతంలో అద్నాన్ అనే యువకుడు 'హిక్మా సెహత్ కేర్ సెంటర్' పేరుతో ఓ క్లినిక్‌ను నడుపుతున్నాడు. కేవలం ఇంటర్ (2018–2020) మాత్రమే పూర్తి చేసిన ఇతను, తన తల్లి సబా ఖాన్ (అలియాస్ మహమ్మది బేగం), సోదరుడు మహ్మద్ ఫైజాన్‌తో కలిసి తమను తాము వంశపారంపర్య హకీంలుగా (సాంప్రదాయ వైద్యులు) పరిచయం చేసుకున్నారు. లైంగిక సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, ఛాతీ నొప్పి, కిడ్నీ సంబంధిత నొప్పులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు వీరు చికిత్స అందిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. రోగులకు ప్రిస్క్రిప్షన్లు ఇవ్వడమే కాకుండా, ఎలాంటి లేబుల్స్ లేని, కేవలం మార్కర్‌తో కోడ్‌లు రాసిన మందులను ఇస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని పోలీసులు తెలిపారు. విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. అద్నాన్ 2023లో బీయూఎంఎస్ (యునాని) పూర్తి చేసిన డాక్టర్ మునార్వా బేగంతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు నెలకు రూ.13,000 చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుని, ఆమె పేరు మీద క్లినిక్‌ను నడపడం ప్రారంభించాడు. డాక్టర్ మునార్వా బేగం అప్పుడప్పుడు మాత్రమే క్లినిక్‌కు వచ్చి వెళ్తుండగా, అద్నాన్, అతని కుటుంబ సభ్యులే పూర్తి స్థాయిలో రోగులకు చికిత్స చేసేవారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, 'సాచ్ న్యూస్' వంటి మాధ్యమాల్లో తమ క్లినిక్‌కు విపరీతంగా ప్రచారం చేసుకుంటూ అమాయకులను ఆకర్షించేవారని పోలీసులు వివరించారు. క్లినిక్‌పై దాడి చేసిన పోలీసులు, పెద్ద మొత్తంలో లేబుల్స్ లేని మందుల పొట్లాలు, బాటిళ్లు, ప్రిస్క్రిప్షన్ పుస్తకాలు, ఫేస్‌బుక్ పేజీకి సంబంధించిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అద్నాన్‌ను అరెస్ట్ చేయగా, అతని తల్లి సబా ఖాన్, సోదరుడు ఫైజాన్ పరారీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. వారి కోసం గాలిస్తున్నామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రోడ్డంతా గుంతలే.. ప్రయాణం నరకప్రాయం!

- జేఎన్ఎస్ స్టేడియం–బస్టాండ్ మార్గంలో అడుగడుగునా ప్రమాదం
- వర్షం వస్తే గుంతల్లో నీరు.. వాహనదారులు, విద్యార్థుల అవస్థలు



హన్మకొండ, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని జేఎన్ఎస్ స్టేడియం నుంచి బస్టాండ్ వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై భారీగా నీరు ప్రవహించడంతో అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణం వాహనదారులు, స్థానికులకు నరకయాతనగా మారింది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ కీలక రహదారిపై ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి అవి కనిపించక పోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు.విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ప్రయాణికులు ప్రతిరోజూ ఈ మార్గంపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో రహదారి దుస్థితిపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించేలోపే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్, రహదారుల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, గుంతలను పూడ్చడంతో పాటు రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

హనుమకొండలో ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

- బీజేపీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పించిన నాయకులు, కార్యకర్తలు
- అంత్యోదయ భావనతో పేదల అభ్యున్నతికి కృషి చేశారన్న సంతోష్ రెడ్డి



హనుమకొండ,సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పగడాల కాళీప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరై దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సార్వభౌమాధికారం కోసం, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలనే అంత్యోదయ భావన కోసం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విశేష కృషి చేశారని అన్నారు. పేదల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలు, చూపిన మార్గదర్శనం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ నిర్మాణంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గంలో కార్యకర్తలు పయనిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంతోష్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వర్షాల విలయం.. నీట మునిగిన ఇందిరమ్మ కాలనీ!

- 49వ డివిజన్‌లో ఇళ్ల చుట్టూ వరద నీరు.. బయటకు రాలేక బాధితుల అవస్థలు
- ఏటా ఇదే తంతు.. శాశ్వత పరిష్కారం కోసం కాలనీవాసుల ఎదురుచూపులు



హనుమకొండ, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో హనుమకొండ పరిధిలోని 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ జలమయమైంది. నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల చుట్టూ, ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు.

ఏటా ఇదే సమస్య.. పరిష్కారం ఎక్కడ?

వర్షాకాలం వచ్చిందంటే ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ తాత్కాలికంగా నీటిని తొలగించడం మినహా ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

కాలనీలో వర్షపు నీరు, మురుగునీరు సాఫీగా వెళ్లేలా సబ్–డ్రెయిన్లు, సైడ్ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన చోట రహదారులను ఎత్తు పెంచి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రతి వర్షాకాలంలో తాము పడుతున్న అవస్థలకు ముగింపు పలకాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నూతన పీఏసీఎస్ చైర్మన్లకు ఘన సన్మానం

- పిన్నింటి అనిల్‌రావు, అత్తి కుమారస్వామికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీఓ,మర్యాదపూర్వకంగా కలిసి అభినందించిన అధికారులు



పర్వతగిరి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి); పర్వతగిరి, చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నూతన చైర్మన్లను ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్, సూపరింటెండెంట్ విష్ణుమూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల నూతనంగా నియమితులైన పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి పీఏసీఎస్ చైర్మన్ అత్తి కుమారస్వామిని పర్వతగిరి కేంద్రంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాల కోసం గుర్తింపు శిబిరం

- 1 నుంచి 18 ఏళ్లలోపు అర్హులైన వారికి సహాయ ఉపకరణాల అందజేతకు ఏర్పాట్లు
- ఈనెల 26న శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిబిరం



పర్వతగిరి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలంలోని 1 నుంచి 18 సంవత్సరాల లోపు అర్హులైన దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. భిక్షపతి తెలిపారు. వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 26న శనివారం ఉదయం 9 గంటలకు శిబిరం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు శిబిరానికి హాజరయ్యే సమయంలో సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఒక ఫొటో వెంట తీసుకురావాలని సూచించారు. శిబిరానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం ఐఆర్‌పీ అశోక్‌ను 9949303163 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

ఏటూరునాగారంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

- 200 కొత్త కోర్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో సర్పంచ్ శ్రీలత విజ్ఞప్తి
- మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు చేరువ చేయాలని డిమాండ్



ఏటూరునాగారం, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో న్యాయవ్యవస్థను మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి–కమ్–అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కలిసి ఏటూరునాగారానికి న్యాయస్థానం మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏటూరునాగారం వంటి మారుమూల, గిరిజన ప్రాంతాలకు న్యాయ సేవలను మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏటూరునాగారం కేవలం మండల కేంద్రం మాత్రమే కాకుండా విస్తృతమైన గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు పరిపాలనా కేంద్రంగా ఉందని శ్రీలత తెలిపారు. స్థానిక ప్రజలు తమ న్యాయపరమైన వ్యవహారాల కోసం ఇతర ప్రాంతాల్లోని కోర్టులను ఆశ్రయించాల్సి వస్తే ప్రయాణ ఖర్చులు, సమయం, రవాణా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

న్యాయం ప్రజల వద్దకే రావాలి

"న్యాయం ప్రజల వద్దకు రావాలి" అనే సూత్రంతో ఏటూరునాగారం మండల కేంద్రంలోనే న్యాయస్థానం ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. స్థానికంగా కోర్టు అందుబాటులోకి వస్తే ప్రజలకు న్యాయ సలహాలు పొందడం, కేసుల దాఖలు, విచారణలకు హాజరు వంటి అంశాల్లో ప్రయాణ భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే స్థానిక న్యాయవాదులు, న్యాయ సేవా సంస్థలు, సంబంధిత పరిపాలనా విభాగాల మధ్య సమన్వయం మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 200 కొత్త కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత కోరారు.

వర్ధన్నపేటలో వైన్స్‌లపై దొంగల పంజా!

- ఒకే రాత్రి రెండు వైన్స్‌లలో భారీ చోరీ
- రూ.3.05 లక్షల నగదు మాయం.. తాళాలు, వెంటిలేటర్లు పగులగొట్టి చొరబాటు
- రంగంలోకి దిగిన పోలీసులు.. దొంగల కోసం ముమ్మర దర్యాప్తు



పర్వతగిరి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పట్టణంలోని మల్లికార్జున వైన్స్, రేణుక ఎల్లమ్మ వైన్స్‌లను టార్గెట్ చేసిన గుర్తుతెలియని దొంగలు ఒకే రాత్రి రెండు షాపుల్లో చొరబడి భారీగా నగదు దోచుకెళ్లిన ఘటన కలకలం రేపింది. వైన్స్ నిర్వాహకులు ప్రతిరోజూ మాదిరిగానే సెప్టెంబర్ 24 రాత్రి సుమారు 9:30 గంటలకు షాపులను మూసివేసి వెళ్లారు. అనంతరం సెప్టెంబర్ 25 ఉదయం సుమారు 10 గంటలకు షాపులు తెరవగా దొంగతనం జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. మల్లికార్జున వైన్స్‌లో వెనుక తలుపు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు కౌంటర్‌లోని రూ.2.40 లక్షల నగదును అపహరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అదే విధంగా రేణుక ఎల్లమ్మ వైన్స్ వెనుక ఉన్న వెంటిలేటర్‌ను పగులగొట్టి లోపలికి చొరబడిన దొంగలు కౌంటర్‌లోని రూ.65 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు వైన్స్‌లలో కలిపి రూ.3.05 లక్షల నగదు చోరీ కావడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాళాలు, వెంటిలేటర్లు పగులగొట్టి దొంగలు పక్కా ప్రణాళికతోనే చోరీకి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైన్స్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాలను పరిశీలిస్తూ దొంగల ఆనవాళ్లు, సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. గుర్తుతెలియని దుండగులను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఆటోనగర్ గణపతి లడ్డూకు భారీ డిమాండ్!

- రూ.1,70,777కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న అనుమాస ప్రసన్న కుమార్
- హోరాహోరీగా సాగిన వేలం.. రూ.1.70 లక్షల వరకు బిడ్ వేసిన అనిమిరెడ్డి రామచంద్రారెడ్డి



వర్ధన్నపేట, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ఆటోనగర్‌లో గణపతి లడ్డూ వేలం పాట హోరాహోరీగా సాగింది. భక్తుల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో వేలం కార్యక్రమం ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు వరంగల్ నాయుడు పంపునకు చెందిన అనుమాస ప్రసన్న కుమార్ రూ.1,70,777కు గణపతి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. వేలం ప్రారంభం నుంచి పలువురు భక్తులు పోటీపడగా అనిమిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.1,70,000 వరకు బిడ్ వేసి గట్టి పోటీ ఇచ్చారు. చివరి దశలో ఆయన పోటీ నుంచి తప్పుకోవడంతో అనుమాస ప్రసన్న కుమార్ వేసిన రూ.1,70,777 బిడ్ ఖరారైంది. వర్ధన్నపేట ఆటోనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం కార్యక్రమం భక్తుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. గణపతి లడ్డూ ప్రసాదం కోసం లక్షల రూపాయల వరకు వేలం పలకడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నవరాత్రి ఉత్సవాల అనంతరం గణపతి లడ్డూ ప్రసాదాన్ని వేదమంత్రాల నడుమ పండితుడు శ్రావణ్ కుమార్ అనుమాస ప్రసన్న కుమార్‌కు అందజేశారు. భారీ మొత్తానికి లడ్డూను దక్కించుకోవడంతో అనుమాస ప్రసన్న కుమార్ పేరు ఆటోనగర్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రజారోగ్యంలో ఫార్మసీ అధికారుల పాత్ర కీలకం

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో ఫార్మసిస్టులు కీలక భూమికజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలి: జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు



ములుగు, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఫార్మసిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఫార్మసీ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసీ అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఫార్మసీ అధికారులు తమ జ్ఞానం, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు మరింతగా దోహదపడగలరని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మేడారం జాతరలో ఫార్మసీ అధికారులు అందించిన సేవలు అభినందనీయమని డాక్టర్ గోపాల్‌రావు ప్రశంసించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులు చేస్తున్న సేవలను గుర్తించి, వారి వృత్తిపరమైన నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అనేష్, జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హిమకిరణ్, స్వామి, వెంకట్, సతీష్, సంధ్య, రాజమణి, మాస్ మీడియా ఆఫీసర్ సంపత్, డీపీఎచ్ఎం శకుంతల, కార్యాలయ సూపరింటెండెంట్ విజయబాబు, ఎల్తైజికేటర్స్ స్వరూపరాణి, సీనియర్ అసిస్టెంట్ గణేష్, డీపీఓ రవీందర్, రహీం ఖాన్, డీడీఎం ప్రవీణ్, నిఖిల్ యాదవ్, అఖిల్, నాణ్యత నిర్వహణ అధికారి శరత్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఓ ఉన్నతాధికారులకు పోలీస్ కమిషనర్ శ్వేత స్వాగతం

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలనక్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు



వరంగల్, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి కె. మాణిక్‌రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని ఉన్నతాధికారులు పరిశీలించారు.

పారఖ్ పరీక్షకు పకడ్బందీగా సిద్ధం కావాలి

- ప్రతి సబ్జెక్టు.. ప్రతి సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి:

జిల్లా అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ ఎండీ షేక్ అంజద్

మంథని, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): 2027లో నిర్వహించనున్న పారఖ్ పరీక్షను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను ఇప్పటి నుంచే పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ ఎండీ షేక్ అంజద్ ఉపాధ్యాయులకు సూచించారు. మంథని మండలంలో శుక్రవారం నిర్వహించిన ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశానికి ఆయన హాజరై పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, పరిహార బోధన, పారఖ్ పరీక్షకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు.
విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులోని ప్రతి సామర్థ్యాన్ని గుర్తించి, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన కొనసాగించాలని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పరిహార బోధన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.
విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ఎంతవరకు అర్థం చేసుకున్నారో ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అవసరమైన చోట అదనపు బోధన అందించాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే విద్యా సర్వేలో పెద్దపల్లి జిల్లా టాప్–50లో నిలిచేలా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

పుస్తకాలకే పరిమితం కాకుండా బోధన

విద్యార్థులకు బోధించే విషయంలో ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛ ఉందని ఎండీ షేక్ అంజద్ తెలిపారు. తమ జ్ఞానం, అనుభవాన్ని ఉపయోగించి బోధనా పద్ధతులను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉదాహరణలు, కార్యకలాపాల ద్వారా బోధించాలని అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అందించే సేవ ఎంతో కీలకమని పేర్కొన్నారు. బోధనలో ఎలాంటి ఒత్తిడికి గురికావాల్సిన అవసరం లేదని, విద్యార్థుల అభ్యసనలో నాణ్యత పెంపుపైనే ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందిస్తూ జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొని పారఖ్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, పరిహార బోధన అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల



తాళ్ల మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన బసవరాజు సారయ్య

- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ మంత్రి,

ఎమ్మెల్సీపలువురు కాంగ్రెస్ నాయకులు హాజరై నివాళులు



వరంగల్, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రముఖ విద్యావేత్త, లెర్నర్స్ ల్యాండ్ సంస్థల వ్యవస్థాపకులు తాళ్ల మల్లేశం మృతిచెందిన నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లేశం కుటుంబాన్ని కలిసి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాళ్ల మల్లేశం విద్యారంగానికి అందించిన సేవలను పలువురు నాయకులు స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ తమ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు నల్లాండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి సరేంద్ర కుమార్, బస వరాజ్ శిరీష శ్రీమన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, వరంగల్ కాంగ్రెస్ సిటీ మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళీగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, డీసీసీ కార్యదర్శి ధూపం సంపత్, సోషల్ మీడియా కన్వీనర్ సోమలక్షి , మహిళా నాయకురాలు



గిరిగిరి పుష్పతో పాటు కాంగ్రెస్ నాయకులు బిల్లా రమేష్, కాశెట్టి వేణు, ఎండీ ఆజామ్, ఇనుగాల సందీప్, తోట బాలరాజు, మార్త ఆంజనేయులు, గుండేటి సతీష్, కొమ్ముల సంధీప్, బత్తుల వినోద్, వెల్దండి లక్ష్మణ్, ఎండీ ఇదా, పులకుర్తి సదానందం, కడారి లెనిన్ తదితరులు పాల్గొని తాళ్ల మల్లేశం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సహకార సంఘ సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత

- రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి: మంథని సింగిల్ విండో

చైర్మన్ కొత్త శ్రీనివాస్‌మాజీ కార్యదర్శి మామిడాల అశోక్‌కుమార్ మృతికి సంతాపం



మంథని, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుల ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో 89వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. end ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సభ్యులు, రైతులకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహకార సంఘం ద్వారా పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి వివిధ సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధి చెందితే సభ్యులు, రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందుతాయని, అందుకు పాలకవర్గం, సిబ్బంది, సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

గత రబీ సీజన్‌లో 36 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించి 5,05,585 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కొత్త శ్రీనివాస్ తెలిపారు. ఈ కొనుగోళ్లలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచామని పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో, జిల్లా కలెక్టర్, సహకార శాఖ అధికారుల సహకారంతో గుంజపడుగు శివారులో రూ.3.40 కోట్లతో ప్రధానమంత్రి కుసుమ్ పథకం ద్వారా సౌర విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. దీనివల్ల సంఘానికి రూ.51 లక్షల ఆదాయం సమకూరుతుందని వివరించారు.



ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గోనె సంచుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని కొత్త శ్రీనివాస్ తెలిపారు. ఎలాంటి కోతలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో రైస్ మిల్లులకు తరలించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. * ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం హయాంలో రైతుల నుంచి ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేస్తున్నామని అన్నారు. టీజీ ఈఆర్సీ సలహాదారు శశిభూషణ్ కాచే మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం, సహకార ఉద్యమం సమయంలో కొంతమంది వ్యక్తులు తమ ఆస్తులు, డబ్బును దారాదత్తం చేసి సహకార సంస్థలను కాపాడుకున్నారని తెలిపారు. కాలక్రమంలో నిర్వహణ లోపాల కారణంగా కొన్ని సహకార సంఘాలు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించే రుణమాఫీ, రుణాలు సకాలంలో చెల్లించిన వారికి ప్రోత్సాహకాలు వంటి చర్యలతో రైతులు, సహకార సంఘాలకు ప్రయోజనం కలిగిందని గుర్తుచేశారు. సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య సంఘం జమా ఖర్చుల వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సమాధానాలు ఇచ్చారు.

మాజీ కార్యదర్శి మామిడాల అశోక్‌కుమారకు సంతాపం

సమావేశం ప్రారంభానికి ముందు సంఘ మాజీ కార్యదర్శి మామిడాల అశోక్‌కుమార్ అకాల మృతికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ సంతాపం ప్రకటించారు. సమావేశంలో సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్‌కుమార్, సిరిమూర్తి ఓదెలు, లెక్కల కిషన్‌రెడ్డి, దాసరి లక్ష్మి – మొండయ్య, ఉడుత మాధవి–పర్వతాల్ యాదవ్, దేవల్ల విజయ్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజుగౌడ్, సర్పంచులు తోటపల్లి పోచయ్య, సంగెం సరోజన–గట్టయ్య, న్యాతరి లత–శ్రీనివాస్, గుమ్మడి సమ్మయ్య, సంధ్య–భానేష్, జాడి రామస్వామి, మాజీ ఎంపీపీ కొండ శంకర్, సంఘ మాజీ డైరెక్టర్ ఇనుముల సతీష్, నాయకులు బెజ్జంకి దిగంబర్, వేల్పుల గట్టయ్య, తిరుపతి, సబ్బని సంతోష్‌తో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

- రూ.8,500 జరిమానా.. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం
- ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు సంచలన తీర్పు

ములుగు జిల్లా , సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): మంగపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు మాతూరి రమేష్‌ను దోషిగా నిర్ధారిస్తూ ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితుడికి రూ.8,500 జరిమానాతో పాటు బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మంగపేట పోలీస్‌స్టేషన్‌లో 2020లో క్రైమ్ నంబర్ 146/2020 కింద భారతీయ శిక్షాస్మృతి లోని 376(ఎన్), 366, 506 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని 5 ఆర్/డబ్ల్యూ 6 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కేసును విచారించిన ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు-కమ్ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ తీర్పు వెలువరించారు. ఈ కేసులో అప్పటి ఏటూరునాగారం అదనపు ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్, గౌస్ ఆలం, ఐపీఎస్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించగా, ఎస్సై శ్రీనివాస్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, ప్రాసిక్యూషన్‌లో ప్రస్తుత అధికారులు అదనపు ఎస్పీ మానస్ భట్, ఐపీఎస్, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై టీవీఆర్ సూరి, కోర్టు పర్యవేక్షణ అధికారి డీఎస్పీ కిషోర్, కోర్టు అనుసంధాన అధికారి ఏఎస్సై కుమార స్వామి, ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది డి. రామ్‌సింగ్, సీడీఓలు కే. మౌనిక (డబ్ల్యూ ఎస్‌టీ-187), జె. మంగీలాల్ (పీసీ-164) తదితరులు కీలకంగా పనిచేశారు. కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం, ప్రాసిక్యూషన్‌లో సమిష్టిగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ములుగు



జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్, ఐపీఎస్ అభినందించారు. పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టడంతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పల్లెలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలిప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి సీతక్క

ములుగు జిల్లా/మల్లంపల్లి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో మంత్రి సీతక్క, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి , ఐఎఫ్ఎస్‌తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.'స్వచ్ఛత హి సేవ' పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.గ్రామాల పరిశుభ్రత కోసం నిత్యం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి సన్మానించారు. వారికి సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, చేతి తొడుగులతో కూడిన రక్షణ కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అడవులు, పచ్చదనం కారణంగానే ములుగు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ప్రకృతే మానవాళికి, జీవరాశులకు జీవనాధారమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ



వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని పిలుపునిచ్చారు. "పరిశుభ్రతను పాటిద్దాం..పచ్చదనాన్ని పెంచుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజలంతా శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. శారీరక శ్రమతో ఆరోగ్యంగా, దృఢంగా ఉండవచ్చని తెలిపారు. ఎండ, వాన, చలిని తట్టుకుంటూ కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, ప్రకృతితో మమేకమై జీవించాలని మంత్రి సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్‌బాబు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీపీఓ వెంకయ్య, డీఆర్‌డీఓ రవీందర్, ఎంపీఓ రహీం, ఏపీడీ, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా సమన్వయకర్త, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రామప్ప వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

- కాకతీయుల శిల్పకళకు రామప్ప దేవాలయం నిలువెత్తు నిదర్శనం
- చారిత్రక, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలి: మంత్రి సీతక్క

ములుగు జిల్లా , సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ములుగు జిల్లా ప్రకృతి వర్ణశోభకు నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వెంకటాపూర్ మండలం పాలంపేటలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో ప్రపంచ పర్యాటక దినోత్సవం–2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్, తెలంగాణ దర్శిని, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు.గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం రామప్ప దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే అంశంతో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శతాబ్దాలుగా తరతరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగుకు ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పేర్కొన్నారు. పచ్చని అడవులు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులతో జిల్లాలో అపారమైన ప్రకృతి సంపద ఉందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరతో పాటు లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు.చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పూర్వీకులు అందించిన వారసత్వంగా మాత్రమే కాకుండా భావితరాలకు అందించాల్సిన విలువైన ఆస్తిగా భావించాలని మంత్రి సూచించారు. పర్యావరణం, చరిత్ర పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు.కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సమాచార పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారథి కళాకారుల బృందం



ప్రదర్శించిన గేయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంత్రి సీతక్క బహుమతులు అందజేశారు.చల్వాయి టీజీఎంఎస్‌కు చెందిన డి. శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్. శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. మనస్విని, ఎ. శ్రుతి, ఎం. పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె. దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్‌రెడ్డి, పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మానాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

14 మంది విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- గురుకుల పాఠశాలకు చేరుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- లోనికి అనుమతించకపోవడంతో హాస్టల్ ఎదుట ధర్నా.. వసతులపై ఆగ్రహం



జనగామ జిల్లా/పాలకుర్తి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విద్యార్థినులను పరామర్శించేందుకు శుక్రవారం పాఠశాల, హాస్టల్ వద్దకు చేరుకున్నారు. ఘటనకు గల కారణాలను విద్యార్థినులను అడిగి తెలుసుకునేందుకు పాఠశాల లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎర్రబెల్లిని పోలీసులు, పాఠశాల సిబ్బంది అడ్డుకున్నారని ఆయన వర్గాలు తెలిపాయి. విద్యార్థుల పరిస్థితి గురించి తెలుసుకున్న తర్వాతే వెళ్తానని ఎర్రబెల్లి చెప్పినప్పటికీ అనుమతి ఇవ్వకపోవడంతో హాస్టల్ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్‌తో ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడారు. విద్యార్థినులకు అవసరమైన కనీస వసతులు కల్పించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ పరిసరాల్లో అపరిశుభ్రత, పేరుకుపోయిన వ్యర్థాలు ఉన్నాయని, గతంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పాము కరిచిన ఘటన కూడా జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ మంగళవారం 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచినప్పటికి ఘటనపై వార్డెన్, ఉపాధ్యాయులు, అధికారులు సకాలంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థినుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల కార్యదర్శి శారదతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను తెలియజేసినట్లు ఎర్రబెల్లి తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని చెప్పారు. హాస్టల్‌లో విద్యార్థినులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎర్రబెల్లి ఆరోపించారు. పాఠశాలల్లో విద్యార్థినుల భద్రత, వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో విద్యార్థుల సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. కాగా, విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనపై సంబంధిత అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లంపల్లిలో రెండు లారీలు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

- ప్రధాన రహదారిపై లారీల ఢీకొనడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం
- అక్రమ పార్కింగ్‌తో ప్రమాదాలకు అవకాశం.. చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి




ములుగు జిల్లా/మల్లంపల్లి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీలు ఢీకొనడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ప్రధాన రహదారికి ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను నిలిపివేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై నిలిపి ఉంచిన లారీలు ఇతర వాహనదారులకు సరిగా కనిపించక ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మల్లంపల్లి ప్రధాన రహదారిపై లారీల పార్కింగ్ సమస్య ఇప్పటికే పలుమార్లు తలెత్తుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీ వాహనాలను ప్రధాన రహదారిపై నిలిపివేయకుండా నిర్దీత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి లేకుండా రహదారిపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ములుగుకు కొత్త న్యాయస్థానం మంజూరు

- రాష్ట్రవ్యాప్తంగా 200 అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానాలకు ప్రభుత్వం అనుమతి
- పెండింగ్ కేసుల పరిష్కారానికి ఊతం.. ప్రజలకు మరింత చేరువ కానున్న న్యాయ సేవలు

ములుగు జిల్లా , సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయశాఖ జీవో నంబర్ 59ను సెప్టెంబర్ 24, 2026న జారీ చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొత్త న్యాయస్థానాలను ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం.. ములుగు జిల్లా కేంద్రానికి ఒక నూతన న్యాయస్థానాన్ని కేటాయించింది. దీంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మరింత అవకాశం ఏర్పడటంతో పాటు, ప్రజలకు న్యాయ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. కొత్త న్యాయస్థానాల ఏర్పాటుకు అవసరమైన సిబ్బంది, భవనాలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన తదుపరి ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ములుగు వంటి మారుమూల ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు చేరువ కావడంలో ఈ నిర్ణయం దోహదపడనుంది. ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు 19, రంగారెడ్డి జిల్లాకు 18 న్యాయస్థానాలు కేటాయించారు. హనుమకొండ జిల్లాకు 6, వరంగల్‌కు 4, మహబూబాబాద్‌కు 3 న్యాయస్థానాలు మంజూరయ్యాయి.



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

COURTS - Civil and Criminal - Establishment of 200 new Additional Junior Civil Judge-cum-Additional Judicial Magistrate of First Class Courts at various stations in the District Judiciary in the State of Telangana - Orders - Issued.

LAW (LA, LAR J-HOME-COURTS.A2) DEPARTMENT

G.O.Ms.No.59 Dated:24-09-2026
Read:-

From the Registrar (Vigilance), High Court for the State of Telangana, Hyderabad, Letter ROC.No.1186/E1/2025, Dated: 29.12.2025 and ROC.No.1186/E1/2025, dated:24.09.2026

ORDER:

In the letter read above, the Registrar (Vigilance), High Court for the State of Telangana at Hyderabad, has requested to accord sanction for sanction of 594 new Additional Junior Civil Judges-cum-Additional Judicial Magistrate of First Class Courts at various stations in the District Judiciary in the State of Telangana, with the staff pattern, necessary infrastructure, budget towards recurring and non-recurring expenditure and to issue early orders.

2. Government after careful examination of the matter, hereby accord sanction of 200 new Additional Junior Civil Judges-cum-Additional Judicial Magistrate of First Class Courts at various stations in the District Judiciary in the State of Telangana in the first phase appended as Annexure to this Government Order. Further necessary orders regarding sanction of staff and other expenditure will be issued, separately.

3. The Registrar (Vigilance), High Court for the State of Telangana at Hyderabad shall take necessary action in the matter.

4. This order issues with the concurrence of the Finance (EBS.IV) Department vide their U.O.No.3641569/1B/A2/EBS.VI/2026, dt:02.09.2026.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

B. PAPI REDDY
SECRETARY TO GOVERNMENT
LEGAL AFFAIRS, LEGISLATIVE AFFAIRS & JUSTICE

To
The Registrar (Vigilance), High Court for the State of Telangana at Hyderabad.
The Director General of Police, Telangana, Hyderabad.
The Director of Prosecutions, Telangana, Hyderabad.
The A.G.(ABE)/Prl. A.G.(Audit-I)/A.G. (Audit-II), Telangana, Hyderabad.
The Advocate General, High Court of Telangana, Hyderabad.
The Pay and Accounts Officer, Telangana, Hyderabad.
All the Collectors and District Magistrates in the State of Telangana.
All the Principal District & Sessions Judges, in the State of Telangana.
All the District Treasury Officers, in the State of Telangana.
Copy to:-
The PS to Principal Secretary to Hon'ble Chief Minister.
The PS to Chief Secretary to Government.
The PS to Secretary to Law Department.
The Finance (EBS.VI/HRM.II) Department.
SF/Sc.

//FORWARDED::BY::ORDER//

SECTION OFFICER

విద్యార్థులకు యూనిఫాంలు, బెల్టుల పంపిణీ

- గుత్తూరు తండా సర్పంచ్ బానోతు రాజు నాయక్ ఆధ్వర్యంలో పంపిణీ
- క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి: సర్పంచ్



ములుగు జిల్లా/మల్లంపల్లి, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గుత్తూరు తండా సర్పంచ్ బానోతు రాజు నాయక్ యూనిఫాంలు, పాఠశాల బెల్టులను పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు రాజు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వక్కల వెంకటస్వామికి టీఎంజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు



హనుమకొండ ,సెప్టెంబర్ 25(నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండకు చెందిన సీనియర్ పాత్రికేయుడు, అంబేద్కర్ ఫెలోషిప్, దళిత రత్న అవార్డు గ్రహీత, వివేక సమయం దినపత్రిక సంపాదకుడు వక్కల వెంకటస్వామి నియమితులయ్యారు. తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన ఫోరమ్ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అణగారిన వర్గాల గొంతుకను సమాజం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పాత్రికేయుల హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతానని తెలిపారు. తనకు ఈ బాధ్యత రావడానికి సహకరించిన ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఫోరమ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వక్కల వెంకటస్వామి పేర్కొన్నారు.

అక్టోబర్ 25 నుంచి హ్యామ్ రోడ్ల పనులు

- ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో దశలవారీగా రహదారి నిర్మాణాలు
- ఆవాసం నుంచి గ్రామపంచాయతీ.. అక్కడి నుంచి మండల కేంద్రానికి రోడ్డు అనుసంధానం లక్ష్యం: మంత్రి సీతక్క

హనుమకొండ, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపడుతున్న హ్యామ్ రోడ్ల పనులను దశలవారీగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలతో నిర్వహించిన సమీక్షలో పనుల ప్రారంభంపై దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో సుమారు 18,472 కిలోమీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో తొలి విడతగా 7,448 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 3 వేల గ్రామపంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. హ్యామ్ విధానంలో నిర్మించే రోడ్లకు 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతను కాంట్రాక్ట్ సంస్థలే చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు.

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పనులు ప్రారంభించే తేదీలను కాంట్రాక్ట్ ఏజెన్సీలకు నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అక్టోబర్ 25 నుంచి కొన్ని పనులు, నవంబర్ మొదటి వారం నుంచి మరికొన్ని పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీకి, గ్రామపంచాయతీ నుంచి మండల కేంద్రానికి రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో హ్యామ్ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు.



హ్యామ్ రోడ్లపై దాదాపు ఏడాది కాలంగా చర్చలు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. ములుగులో హ్యామ్ రోడ్లకు సంబంధించిన పనులకు గత నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లాలో కూడా అక్టోబర్ 25 నుంచి పనులు ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళిక

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనే అంశంపై అసెంబ్లీలో చర్చించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. కేవలం ఉపాధి పనులు కల్పించడమే కాకుండా వాటి ద్వారా గ్రామాల్లో శాశ్వత ఆస్తులు, నీటి సంరక్షణ వనరులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జలసిరి కార్యక్రమం కింద ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి గ్రామానికి ఊటకుంట, ప్రతి పంటకు పంట కుంట ఏర్పాటు చేయడంతో పాటు ఏజెన్సీ గ్రామాల్లో వాగుల వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఉపాధి హామీ పనుల్లో పంట పొలాల్లో పంట కుంటలు, పశువుల కొట్టాలు, కోళ్ల పెంపకం కేంద్రాలు వంటి ఆస్తులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



అక్టోబర్ 2న గ్రామ సమగ్ర ప్రణాళిక

అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ సమగ్ర ప్రణాళికలను రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వాటితో కూడిన మ్యాప్‌లను రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామీణ అభివృద్ధి పనులను వేగవంతం చేసి గ్రామాలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గడం, వర్షాలు తగ్గడం వల్ల తాగునీటి సమస్యలు తలెత్తినట్లు మంత్రి పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులతో తాగునీటి అవసరాలను తీర్చేందుకు సరిపడా నీరు ఉందని తెలిపారు.

ఇంట్లో బంధించిన జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలి

- అత్తపై చర్యలు తీసుకోవాలి.. నోటరీ ద్వారా రాసిచ్చిన ఇల్లు, ఆస్తులు ఇప్పించాలి
- సీపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజా సంఘాల నేతల డిమాండ్

హనుమకొండ, సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ రాంనగర్‌కు చెందిన గూడూరు జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, కాకతీయ విశ్వవిద్యాలయ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, మహాత్మా జ్యోతిరావు ఫూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రామచందర్ రావు డిమాండ్ చేశారు. గూడూరు జయశ్రీని ఆమె అత్త మీరాబాయి ఇంట్లో తాళం వేసి బంధించిందని ఆరోపిస్తూ, నాలుగు రోజులుగా ఆమె ఇంట్లోనే నిరసన కొన సాగిస్తున్న నేపథ్యంలో శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జయశ్రీకి గతంలో ఆమె అత్త మీరాబాయి నోటరీ పత్రం ద్వారా రాసిచ్చిన ఇల్లు, ఆమెకు రావాల్సిన ఆస్తులను వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జయశ్రీతో పాటు ఆమె కుమార్తె తేజస్విని రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



జయశ్రీ కుటుంబం ఎదుర్కొంటున్న సమస్యపై హనుమకొండ పోలీస్ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు కోరారు.ఈ కార్యక్రమంలో మాదిగ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడ స్వామి మాదిగ, నాయకులు మోరే ఐలయ్య, గోల్కొండ శ్రీనివాస్, శ్రీరాం మల్లేశం పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతం

- అధ్యక్షుడిగా డాక్టర్ కె. రాజేందర్ ఎన్నిక
- నూతన కార్యవర్గానికి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ అభినందనలు

హన్మకొండ/కెయూ ,సెప్టెంబర్ 25 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ (కూప్లా) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. అధ్యక్ష పదవికి డాక్టర్ కె. రాజేందర్, డాక్టర్ కె. సుబాష్ పోటీ చేయగా, మొత్తం 145 మంది ఓటర్లకు గాను 84 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డాక్టర్ కె. రాజేందర్ 64 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. డాక్టర్ కె. సుబాష్‌కు 20 ఓట్లు వచ్చాయి. ఎన్నికల ఫలితాలను ప్రిసైడింగ్ అధికారి డాక్టర్ ఆదిరెడ్డి ప్రకటించారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ నాగేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వాణీ దేవి, కోశాధికారిగా డాక్టర్ టి. మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ పి. మహేందర్, ఉమెన్ కన్వీనర్‌గా డాక్టర్ భాగ్యమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన పార్ట్‌టైమ్ అధ్యాపకులు, ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ నిర్వహణ కమిటీ సభ్యులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ సర్వే

- ప్రవేట్ వ్యక్తుల మధ్య పంచాయతీలో తలదూర్చం
- భూమే ప్రమాణికంగా భూ సర్వే జరుగుతుంది
- వరి పాలాల గట్ట పై నడుస్తూ, రైతులకు అవగాహన కల్పించారు
- కొంగర భూ సర్వే ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్





నిత్యం నిఘా, ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 25 :
భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. పేర్కొన్నారు. మండలం లోని కొంగర గ్రామంలో జరుగుతున్న భూ సర్వే ను శుక్రవారం పరిశీలించారు. వరి పొలాల బురదలో గట్ల పై నడుస్తూ రైతుల వద్దకు వెళ్లి సర్వే పై అవగాహన కల్పించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు, అను మానాలకు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు భూ సర్వే లో భూవివాదాలకు చెక్ పడుతుందన్నారు.భూమి ఎంత ఉందో అంతే లెక్క అన్నారు. సర్వేకు భూమే ప్రమాణికంఅన్నారు. ఈ సర్వే వలన వేయ్యిళ్లే వరకు కూడ లెక్క మారదన్నారు. రైతులకు మ్యాఫ్ పట్టాలు అందిస్తామన్నారు. ప్రవేట్ వ్యక్తుల మధ్య పంచాయతీ లో అధికారులు తలదూర్చమని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే వారే సమన్వయం చేసుకుని పరిష్కారం చేసుకోవాలని సూచించారు. భూమి ని బట్టి సర్వే జరుగుతుందని అన్నారు. సర్వే సమయంలో ప్రతీ రైతు ఉండాలని సూచించారు. సర్వే పూర్తిగా రైతుల సమక్షంలో ఉంటుందన్నారు. రైతులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రోపర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో డిజిటల్ సర్వేనిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో సెంటు భూమి కూడ తప్పులు జరగదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ పరాస్ కూమార్, సర్వేయర్ ఏడీ రాజేందర్, నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా ను సందర్శించిన యువ టూరిజం క్లబ్



నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 25 : స్థానిక ఎస్ ఆర్ బి జిఎన్ ఆర్ కళాశాల యువ టూరిజం క్లబ్ విద్యార్థులు శుక్రవారం ఖమ్మం లో గల చారిత్రక ఖిల్లా ను సందర్శించారు.రానున్న ఆదివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని హెరిటేజ్ వాక్ ను నిర్వహించారు. విద్యార్థులు చారిత్రక సాంస్కృతిక వారసత్వ సంపద ను ముందు తరాలకు అందజేయాలని సైన్స్ విభాగ వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.నర్సమ్మ విద్యా ర్థులకు సూచించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ క్విజ్ పోటీ లను ని ర్వహించారు. కార్యక్రమంలో ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డా.ఎం.వి.రమణ అధ్యాపకులు ,డా.ఎం.పిచ్చయ్య,డా.వే ణుమాధవ్, హిస్టరీ విభాగ అధ్యాపకులు నాగలక్షి , డా.కె.శ్రీనివాస్,డా అజిత్,డా.వీ రన్న ,బంగారి డా రవివర్ధన్,డా.లక్ష్మణరావు నరసింహారావు యూత్ క్లబ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు విద్యార్థులు ముందుండాలి



నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 25 : డిగ్రీ లో చేరిన విద్యార్థులు సామాజిక సేవ లో ముందుండాలని స్థానిక ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ సైన్స్ వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.నరసమ్మ అన్నారు.జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కలిగించారు.సేవాపథకం లక్ష్యాలు వాటి ప్రాధాన్యతలను వివరించారు.కార్యక్రమంలో ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.ఎం.పిచ్చయ్య,డా.ధర్మయ్య ,డా. లక్ష్మణరావు అధ్యాపకులు డా. వై రవివర్ధన్, పి.నరసింహారావు, బి వెంకటేశ్వర్లు, బంగారి ఎం.వి.రమణ, వేణు మాధవ్ నాగలక్షి అజిత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం





నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 25 :
ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు మరియు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణు మాధవరావు హాజరై, జిల్లా వ్యాప్తంగా సేవలందిస్తున్న ఫార్మసిస్టులందరికీ ప్రపంచ ఫార్మ సిస్టుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఔషధాలను అందించడంలో, మందుల సరైన వినియోగంపై రోగులకు అవగాహన కల్పించడంలో మరియు మందుల భద్రతా ప్రమాణాలను పాటించడంలో ఫార్మసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. మొత్తం ఆరోగ్య రక్షణ వ్యవస్థలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో విలువైన వని పేర్కొంటూ, ప్రజారోగ్య పరిరక్షణలో వారు మరింత అంకితభావం, బాధ్యతాయుతమైన దృక్పథంతో పనిచేయా లని సూచించారు.ఈ వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రభుత్వ ఫార్మసిస్టులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఎస్ బీ ఐ టీ లో ఘనంగా గణేష్ నిమర్జన వేడుకలు







నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 25 : స్థానిక ఎస్. బీ. ఐ. టీ కళాశాలలో గణేష్ నిమర్జన వేడుకలు శుక్ర వారం కళాశాల ప్రాంగణం లో ఘనంగా నిర్వహించి నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకట నలో తెలియజేశారు. మొదట విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది సమక్షం లో గణేష్ శోభా యాత్ర ను నిర్వహించి తదనంతరం నిమర్జన కార్య క్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తి శ్రద్ధలతో సాగనంపడం మన ఆచారమని తెలిపారు.కళాశాల సెక్రటరీ అండ్ కరె స్పాండెంట్ డాక్టర్ ధాత్రి మాట్లాడుతూ తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనా ధుడు ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. గత సంవత్సరం ఖమ్మం పట్టణం ఇదే సమయంలో ఎదుర్కున్న వరద విపత్తులను గుర్తు చేసుకుంటూ ఆ గణేషుడి దీవెనలతో ఖమ్మం ప్రజలు ఈ సంవత్సరం అయినా సుఖ సంతోషాలతో ఉండాలని కళాశాల వైస్ చైర్మన్ కే.శ్రీ చైతన్య వేడుకున్నారు.శోభా యాత్ర లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు అధ్యాపకులు భక్తి ప్రపత్తులతో శుభ యాత్ర లో పాల్గొన్నారని, నిమర్జన కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని ఆ గణనాధునికి వీడుకోలు పలికారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం కార్యక్ర మంలో కళాశాలకు చెందిన ఈ.సి. ఈ విభాగం వారు 21,000 రూపాయలకు దక్కించుకున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్, డాక్టర్ ఏ. వి. వి.శివ ప్రసాద్, గంధం శ్రీనివాస్, వివిధ విభాగపు అధినేతలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన కరాటే వేణు

- క్రీడారంగంలో ఖమ్మం ఖ్యాతిని పెంచుతున్న వేణు సేవలు
- మంత్రి పొంగిలేటి చే అభినందనలు అందుకున్న వేణు



నిత్యం నిఘా, ఖమ్మం, సెప్టెంబర్ 25 :
సుమన్ షూటర్స్ అకాడమీ ఇండియా ఉపాధ్యక్షులు కరాటే క్రీడాకారుడు కరాటే వేణు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించటం పట్ల తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చే అభినందనలు అందు కున్నారు. శుక్రవారం హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన ప్రతిష్టాత్మక కరాటే కార్యక్రమం లో సుమారు 2000 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా నిర్వహించిన కార్యక్ర మంలో ఖమ్మం నుంచి పాల్గొన్న కరాటి వేణు తన ప్రతిభను కన బరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వామ్యంగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కరాటే వేణు వంటి క్రీడాకారుల్లో ప్రతిభ కనబరుస్తూ అంత ర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటం ఖమ్మం జిల్లాకే గర్వకా రణం అన్నారు. కరాటే వేణు సాధించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు యువతకు స్ఫూర్తిదాయకమని క్రీడల పట్ల యువతలో ఆసక్తిని పెంపొందిస్తూ మరింత మంది క్రీడాకారులను ప్రోత్సహించేం దుకు వేణు చేస్తున్న కృషి అభినందనీయమని వారు తెలియజే శారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భారీ సంఖ్యలో కరాటే క్రీడాకారులు ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమం క్రీడార రంగంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఖమ్మం నుంచి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొన్న గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించిన కరాటి వేణును పలువురు క్రీడా అభి మానులు అభినందించారు. క్రీడారంగంలో ఖమ్మం ఖ్యాతిని మరింత పెంచేలా వేణు చేస్తున్న కృషి అభినందనీయమని కృష్ణ ఇమామ్ బాయ్ చల్లా రామకృష్ణారెడ్డి దుర్గాబాయి వట్టి బొమ్మ శ్రీనివాసరెడ్డి మందడపు నాగేశ్వరరావు మొగిలిచర్ల సైదులు ఉపేందర్ విప్ల వ్ ప్రసాద్ ఎయిర్టెల్ నరసారావు తదితరులు పేర్కొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ వేణు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షిం చారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..?





నిత్యం నిఘా, ఏన్కూర్, సెప్టెంబర్ 25 : ఏన్కూర్ మండల పరిధిలోని ఆరి కాయలపాడు – జన్నారం గ్రామాల మధ్య వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి గతంలోనే అనుమతి లభించిందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నప్పటి కీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం పై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు సౌరశక్తి భరోసా.. డీఈ రమేష్ క్షేత్రస్థాయి పరిశీలన



నిత్యం నిఘా, ఏన్కూరు, సెప్టెంబర్ 25 : ఏన్కూరు మండల పరిధిలోని శ్రీరామగిరి ,లచ్చగూడెం గ్రామంలో వ్యవసాయ అవసరాలకు సౌర విద్యుత్ వ్యవస్థను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసే అంశంపై విద్యుత్ శాఖ డీఈ రమేష్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ మోటార్ల వద్దకు వెళ్లి ప్రస్తుత విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించడంతో పాటు, సౌర విద్యుత్ ద్వారా మోటార్లను నిర్వహించే అవకాశాలను పరిశీలించారు.రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తగ్గించే దిశగా సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు చర్చించారు. ప్రయోగాత్మకంగా సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలు, మోటార్ల వద్ద ఉన్న పరిస్థితులు, అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను డీ.ఈ రమేష్ పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి యాసిన్, ఏఈ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగు వరద పరిస్థితిని పరిశీలించిన పినపాక తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి



నిత్యం నిఘా, పినపాక, సెప్టెంబర్ 25 : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని ఈ బయ్యారం సమీపంలో ఉన్న పెద్దవాగు వరద ఉధృతిని పినపాక తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్ తో కలిసి ఆయన వాగులోకి వస్తున్న నీటి ప్రవాహాన్ని, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... వర్షాల కారణంగా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అత్యవసర సమయాల్లో సహాయం అందించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు వాగు పరివాహక ప్రాంతాల నివాసితులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న సమయంలో వాటిని దాటేందుకు సాహసించకూడదు.పిల్లలు, పశువుల కాపరులు వాగుల వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులకు లేదా మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం





నిత్యం నిఘా, కేశంపేట, సెప్టెంబర్ 25 : కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడిని భక్తులు, యువత ఉత్సాహంగా ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు గణపతి నామస్మరణలు, జైజైకారాలతో సందడి చేశారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ సర్పంచ్ ప్రేమ్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ నరేష్, వార్డు సభ్యుడు మాధవ్, నాయకులు ఉదయ్ గౌడ్, సత్యం గౌడ్, శివ గౌడ్, సాయి గౌడ్, అరవింద్ గౌడ్, రితీష్, తక్రుబ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.52 వేలతో మహాగణపతి లడ్డూ సొంతం

కొండారెడ్డిపల్లి గ్రామంలోని గౌడ్స్ కాలనీలో ఏర్పాటు చేసిన మహాగణపతి లడ్డూ వేలంపాటలో ఎస్ఎస్ డైరీ ఫార్మ్స్ అధినేతలు కానం శివగౌడ్, బుర్రి సాయిగౌడ్ రూ.52 వేలతో లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వినాయక సేవా సమితి సభ్యులు వారికి అభినందనలు తెలిపారు. మహాగణపతి ఆశీస్సులు శివగౌడ్, సాయిగౌడ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాకునూరులో ఘనంగా అన్నదానం..
విఘ్నేశ్వరుడి సన్నిధిలో సేవా స్ఫూర్తి

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కీర్తిశేషులు అల్లం రామకోటి రెడ్డి, అల్లం వెంగల్ రెడ్డి జ్ఞాపకార్థంగా సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని చాటినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా విఘ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కీర్తిశేషుల జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతృప్తి నిచ్చిందన్నారు. భక్తి, సేవ, ఐక్యతతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో విఘ్నేశ్వర యూత్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూకు భారీ ధర..
రూ.2.30 లక్షలకు సొంతం

కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంపాట శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేలం పాటను ఆసక్తిగా తిలకించారు. పెద్ద లడ్డూకు పోటీగా వేలం కొనసాగగా, చివరకు గంగపురం మహాలింగం రూ.2,30,000లకు దక్కించుకున్నారు. చిన్న లడ్డూను పోరండ్ల శ్రీనివాసులు రూ.5,500లకు సొంతం చేసుకున్నారు. లడ్డూలను దక్కించుకున్న భక్తులు వినాయకుడి ఆశీస్సులతో కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,, ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలంపాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. వేలంపాట ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉత్సవాల నిర్వహణతో పాటు సామాజిక కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. లడ్డూ వేలంపాట విజయవంతం కావడంతో నిర్వాహకులు, కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. లడ్డూలను దక్కించుకున్న గంగపురం మహాలింగం, పోరండ్ల శ్రీనివాసులను నిర్వాహకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

షామీర్‌పేట పెద్ద చెరువుకు సీట్‌బెల్ట్‌తో వినాయకుడు

● అంగరంగ వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు









నిత్యం నిఘా, శామీర్ పేట, సెప్టెంబర్ 25 : గణేశ్ నిమజ్జనోత్సవాలు శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద శుక్రవారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. షామీర్‌పేట పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో గణనాథులను భక్తులు నిమజ్జనానికి తరలించారు. భక్తుల నినాదాలతో చెరువు పరిసర ప్రాంతాలు మార్మోగాయి.ప్రత్యేకంగా ఓ వినాయక విగ్రహాన్ని వాహనంలో సీట్‌బెల్ట్ కట్టి తరలించడం అందరినీ ఆకట్టుకుంది. వినాయకుడికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా భక్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.నిమజ్జనోత్సవాల సందర్భంగా షామీర్‌పేట పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కీసర సర్కిల్ పోలీసు అధికారులు సిబ్బందిని పెద్ద సంఖ్యలో మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతోపాటు రాత్రివేళల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.భక్తుల సౌకర్యార్థం 24 గంటలూ తాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచారు. వాలంటీర్లను ఏర్పాటు చేసి చెరువు పరిసరాల్లో భక్తులకు అవసరమైన సహాయాన్ని అందించారు. నిమజ్జనోత్సవాలను తిలకించేందుకు చిన్నారులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అధికారులు, పోలీసులు సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.

భూపాలపట్నం రహదారిపై వర్షపు నీరు.. తక్షణ చర్యలు చేపట్టిన ఎంపీడీవో, సర్పంచ్





నిత్యం నిఘా, పినపాక, సెప్టెంబర్ 25 : పినపాక మండలం భూపాలపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో భారీ వర్షాల కారణంగా రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్న విషయం గుర్తించిన సర్పంచ్ స్వప్న వెంటనే స్పందించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి నీరు నిలిచిన ప్రాంతంలో అవసరమైన చర్యలు చేపట్టారు. చేపట్టిన పనులను ఎంపీడీవో సంకీర్త్, ఏంపీవో వెంకటేశ్వరరావు పరిశీలించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. దీంతో స్థానికులు సర్పంచ్, అధికారుల స్పందనపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అరుణ శ్రీ, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com